బలగం TV
BALAGAM
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 26 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## డీలిమిటేషన్‌పై పిటిషన్ తిరస్కరణ

### తెలంగాణ, ఏపీ అసెంబ్లీ సీట్లు పెంపు అంశంలో కేంద్రానికి ఆదేశాలిచ్చే అవకాశంలేదు : సుప్రీంకోర్టు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచేందుకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు వెల్లడించింది. జమ్మూకశ్మీర్‌తో పోలిస్తే రాష్ట్రాల్లో డీలిమిటేషన్ నిబంధనలు వేరని పేర్కొంటూ కేంద్రానికి ఆదేశాలివ్వలేమని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ని అమలు చేయాలని కోరుతూ కె. పురుషోత్తం రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం – కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్‌కు వర్తించే చట్టాలు రాష్ట్రాలకూ వర్తించవు అని అభిప్రాయపడింది. రాష్ట్రాల విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3) ప్రకారం, తదుపరి డీలిమిటేషన్ ప్రక్రియ 2026 జనాభా లెక్కల తర్వాత మాత్రమే సాధ్యమని ధర్మాసనం స్పష్టం చేసింది. డీలిమిటేషన్ పెద్ద కసరత్తు అని, దీనిని ఒకే రాష్ట్రం కోసం రాత్రికి రాత్రే చేపట్టలేమని కేంద్రం తరపున అదనపు సోలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్ వాదనలు వినిపించారు.

# మాల్దీవులకు రూ.4,850 కోట్లు

- రుణం ప్రకటించిన ప్రధాని మోదీ
- భారత్‌కు నిజమైన మిత్రదేశం అంటూ మాల్దీవుల ప్రశంసలు
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత ప్రధాని నరేంద్ర మోదీ మాల్దీవుల పర్యటనలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మాల్దీవులకు రూ.4,850 కోట్ల రుణం ప్రకటించారు. ఈ నిధులను మాల్దీవులు మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించుకోనున్నారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ, "మాల్దీవులు భారత్‌కు నిజమైన స్నేహితుడు. కష్టకాలంలో ముందు అండగా నిలిచేది భారత్‌నే" అని పేర్కొన్నారు.

భారత్– మాల్దీవుల మధ్య సత్సంబంధాలు ఈ ఏడాది 60వ వసంతంలోకి ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో మాలెలో జూలై 24న జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఇరు దేశాలు అంగీకరించాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా ముందడుగు వేశాయి. మ్యారిటైమ్ సహకారం, ఆర్థిక సంబంధాలపై కీలకంగా చర్చించారు.

**"భారత్ మిత్రుడిగా ఉండటం మాల్దీవులకు గౌరవం" - ముయిజ్జు**

భారత ప్రధాని పర్యటనపై మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు సంతోషం వ్యక్తం చేశారు. "నరేంద్ర మోదీ పర్యటన మాకు గౌరవంగా భావిస్తున్నాం. ?4,850 కోట్ల రుణం ప్రకటించడంతో మాల్దీవుల అభివృద్ధికి ఊతం లభించనుంది. నాలుగు కీలక ఒప్పందాలపై భారత్‌తో మేము సంతకాలు చేసుకున్నాం. ఈ అనుబంధం మరింత బలపడాలి," అని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీకార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారని, అదానీ ఓబీసీనా అని కేంద్రాన్ని నిలదీశారు. మీడియారంగంలో ఓబీసీలకు స్థానం ఎక్కడుందని విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రతి ఒక్కరికీ కలలు సాకారం చేసుకొనే హక్కు ఉందని, రైతు కుమారుడు వ్యాపారవేత్త కావొచ్చని పేర్కొన్నారు. అవకాశాలు అందిపుచ్చుకొనే సామర్థ్యం అందరికీ రావాలన్నారు. తమ శక్తిని తెలుసుకోలేకపోవడమే కొందరి సమస్యగా చెప్పుకొచ్చారు.దేశంలో దళితుల చరిత్రను అంబేడ్కర్ మాత్రమే అర్థం చేసుకున్నారని రాహుల్ వివరించారు. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తెలంగాణలో పకడ్బందీగా కులగణన చేపట్టారని, అభివృద్ధిలో విద్యదే కీలకపాత్ర అన్నారు. ఇంగ్లీషు నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయన్నారు. కానీ బీజేపీ నేతలు మాత్రం ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రాంతీయ భాషలు ముఖ్యమే, అలాగే ఇంగ్లీషు కూడా కీలకమైన అని రాహుల్ అన్నారు. ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్న వారు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని బీజేపీ నేతలను ప్రశ్నించారు.

**మాలె విమానాశ్రయంలో మోదీకి ఘనస్వాగతం**

బ్రిటన్ పర్యటన అనంతరం మాల్దీవులకు చేరుకున్న ప్రధాని మోదీకి మాలె విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు ముయిజ్జు స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీని ఆహ్వానించారు. మోదీ శనివారం మాల్దీవుల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. భారత్ సహకారంతో చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించనున్నారు.

## ఓబీసీల సమస్యలు అర్థం చేసుకోలేకపోయా...

- కేంద్రంలో ఉన్నప్పుడు కులగణన చేయకపోవడం తప్పే
- ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపివేశారు
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై తన వైఖరిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో ఉన్నప్పుడు వారి సమస్యలు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయానని, అది తాను చేసిన తప్పేనంటూ ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు కుల గణన చేపట్టలేకపోవడమే తన తప్పుగా పేర్కొన్నారు. తాను ఓబీసీలను సరైన రీతిలో రక్షించలేకపోయానని అంగీకరించారు. ఇది కాంగ్రెస్ పార్టీ తప్పు కాదు, పూర్తిగా తన వ్యక్తిగత తప్పేనని స్పష్టం చేశారు.శుక్రవారం నాడు ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ 'భాగిదారీ న్యాయ్ సమ్మేళన్' కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు.

"2004 నుంచి రాజకీయాల్లో ఉన్నాను. గతాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ఓ స్పష్టమైన విషయం తెలుసుకుంది. అప్పట్లో ఓబీసీల సమస్యలు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. కుల గణన చేయించలేకపోయాను. అది నా తప్పు. ఇప్పుడు ఆ తప్పును సరిచేసే బాధ్యత తీసుకుంటున్నాను," అని చెప్పారు. ఓబీసీలకు న్యాయం జరిగేలా కుల గణన తప్పనిసరి అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ఇప్పుడు తాను పూర్తి స్థాయిలో కుల గణనకు కట్టుబడి ఉన్నానని ప్రకటించారు.

**కేంద్రంలో బహుజనుల హక్కులను కుదించే కుట్ర సాగుతోంది**

ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు రిజర్వేషన్ కింద ఉన్న ఖాళీలను కేంద్ర ప్రభుత్వం గణనీయంగా భర్తీ చేయకుండా ఉద్దేశపూర్వకంగా వదిలివేస్తోందని రాహుల్ ఆరోపించారు.

పార్లమెంటులో మోదీ ప్రభుత్వం సమర్పించిన లెక్కల ప్రకారం

కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టుల్లో
ఎస్టీ: 83% ఖాళీ
ఓబీసీ: 80% ఖాళీ
ఎస్సీ: 64% ఖాళీ

అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల్లో
ఎస్టీ: 65% ఖాళీ
ఓబీసీ: 69% ఖాళీ
ఎస్సీ: 51% ఖాళీ

ఈ ఖాళీలను ఎన్‌ఎఫ్‌ఎస్ అనే నెపంతో అర్హులైన అభ్యర్థులను తొలగించడం జరుగుతోందని ఆరోపించారు. ఇది సాంస్కృతిక మానువాద దృష్టికోణంతో నడిచే కుట్ర అని తీవ్ర విమర్శలు చేశారు. "ఈ విధంగా బహుజనులను విద్య, పరిశోధన, విధానాల రూపకల్పనలో నుండి దూరం పెడుతున్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు. గణనీయమైన కుట్ర. బహుజనుల హక్కులు కాలరాస్తే మౌనంగా ఉండం. ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలి," అని డిమాండ్ చేశారు.

## 28న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. శుక్రవారం జరగాల్సిన ఈ సమావేశం ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరగనుంది. ఈ మేరకు శుక్రవారం సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి కూడా వెళ్లారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా అక్కడే ఉండిపోయారు. దీంతో సీఎం, ఐదుగురు మంత్రులు అందుబాటులో లేకపోవడంతో క్యాబినెట్ సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేసినట్టు ప్రకటించింది. వీరంతా శుక్రవారం సాయంత్రానికి హైదరాబాద్‌కు తిరిగొచ్చారు.

## ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక డ్రైవ్



- ఆగస్టు మొదటి వారంలో స్పెషల్ డ్రైవ్
- పీఆర్ ఆర్డీ సమీక్షాసమావేశంలో మంత్రి సీతక్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రామాల్లో పచ్చదనం–స్వచ్ఛదనం పెంచేలా ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలు జారీ చేశారు. భారీవర్షాలతో గ్రామీణ రహదారులు దెబ్బతినే ప్రమాదమున్నందున సత్వరమే పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్య పర్యవేక్షణ కోసం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ప్రధాన కార్యాలయంలో డీఈ, ఎస్ఈలతో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో పీఆర్ఆర్డీ శాఖపై మంత్రి సీతక్క అడిషనల్ కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య, గ్రామీణ రోడ్లు, ప్లాంటేషన్‌పై సమీక్ష నిర్వహించారు. వనమహోత్సవం కార్యక్రమంలో వేగం పెంచాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్ లైన్లను నిత్యం పరిశీలించాలనీ, వర్షాలు, వరదలతో పైపులు లీకైతే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదమున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగు నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అధికారులంతా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు అధికారులందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి రోజు నివేదికలు పంపాలని ఆదేశించారు. సమీక్షలో పీఆర్ఆర్డీ శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీధర్, డైరెక్టర్ జి.సృజన, ఈఎన్సీలు కృపాకర్‌రెడ్డి, ఎన్.అశోక్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో మళ్లీ గందరగోళం

- బీహార్ ఎస్ఐఆర్‌పై రగడ, సభలు వాయిదా



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు శుక్రవారం ఐదవ రోజులోకి ప్రవేశించగా, బీహార్ ఎస్ఐఆర్ అంశంపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో రెండు సభలూ ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడ్డాయి. లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేయగా, రాజ్యసభ మాత్రం రోజు మొత్తానికి వాయిదా పడింది. వాయిదాల అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్ని పార్టీల సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి సభ వ్యవహారాలు ప్రశాంతంగా సాగేలా నేతలు అంగీకరించినట్టు పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి.

**'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్‌సభ సిద్ధం**

ప్రతిపక్షాల డిమాండ్ మేరకు సోమవారం 'ఆపరేషన్ సిందూర్' అంశంపై లోక్‌సభలో చర్చ జరగనుంది. ఇది దేశంలో ముఖ్య చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఇది గమనార్హం.

**రెండు కీలక బిల్లులకు లోక్‌సభ అజెండాలో స్థానం**

లోక్‌సభ అజెండాలో రెండు ముఖ్యమైన బిల్లులు ఉన్నాయి:

## ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. శనివారం ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. శని, ఆదివారాల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నది. ఈనెల 30న ఎప్‌సెట్ రెండోవిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లున్నాయి. ఎప్‌సెట్ మొదటి విడతలో 77,561 మందికి సీట్లు కేటాయించారు. వారిలో 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. ఇంజినీరింగ్‌లో 7,650 సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందులో కన్వీనర్ కోటాలో 5,355 సీట్లున్నాయి. దీంతో ఎప్‌సెట్ రెండో విడతలో కన్వీనర్ కోటాలో 28,429 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి.

## వరంగల్ ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులిస్తూ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలుపెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది.

## దళిత వ్యతిరేకి కాంగ్రెస్

- సాయిలన్నపై జరిగిన అన్యాయం దళిత సమాజాన్ని గాయపరిచింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్
- లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన



**బలగం టీవి, కామారెడ్డి**

మాజీ ఎంపీపీ సాయిలన్నకు జరిగిన అన్యాయం ఎవ్వరికీ జరగలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దళిత వ్యతిరేకి కాంగ్రెస్‌ను గద్దె దించుదామని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో నిర్వహించిన ఆత్మ గౌరవ గర్జన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత బిడ్డ ముదాం సాయిలను కేటీఆర్ బహుమతితో సన్మానించారు.

ఆయన మాట్లాడుతూ దళితుల గౌరవాన్ని తాకట్టు పెట్టే చర్యలకు తాము తలొగ్గబోమని, దళిత వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో శుక్రవారం నిర్వహించిన ఆత్మగౌరవ గర్జన సభలో పాల్గొన్న ఆయన, దళిత బిడ్డ సాయిలన్నకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగలేదని పేర్కొన్నారు. "దళితుల న్యాయానికి ప్రతీకగా కేసీఆర్ తీసుకొచ్చిన దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిపెట్టేసింది. 12 లక్షల మద్దతు అందిస్తామని చెప్పి ఇప్పుడు ఒక్క రూపాయి కూడా ఇవ్వని పరిస్థితి. ఇది ఘోర మోసం," అని విమర్శించారు.

రేవంత్ రెడ్డి రైతులను, నిరుద్యోగులను మోసం చేశారన్నారు. "రైతులకు రెండు విడతల్లో రైతు భరోసా అందించలేకపోయారు. కానీ రాహుల్ గాంధీ ఖాతాల్లో మాత్రం నిత్యం డబ్బులు పడుతున్నాయి. పేద ప్రజలకు రావలసిన డబ్బులు ఢిల్లీకే చేరుతున్నాయి," అని విమర్శించారు.

గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. "100 మంది పిల్లలను బలితీసుకున్న ఘాతుకానికి రేవంత్ రెడ్డే బాధ్యుడు. ఆయన పాలనలో విద్యార్థుల భవిష్యత్తు హరించబడుతోంది," అని ఆరోపించారు.

"ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం అభయహస్తం. ఈ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు. ఎల్లారెడ్డిపేట నియోజకవర్గానికి 18 నెలల్లో ఏం చేసిందో చెప్పలేరు," అని ప్రశ్నించారు కేటీఆర్. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. "ముందుగా సాయిలన్న బట్టలు విప్పి అవమానించారు.. రేపు కాంగ్రెస్ బట్టలు విప్పే పని ప్రజలదే," అని హుషారు చేశారు.

లక్షలాది మందిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని వాళ్లకు బోధించి, ఎత్తిన జెండా దించకుండా 14 ఏళ్ల పాటు కేసీఆర్ కొట్లాడితే బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగం ఆధారంగా తెలంగాణ వచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఆ మహనీయున్ని గౌరవించుకోవడానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్ఠించుకున్నామని.జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమున్నతంగా గౌరవించుకున్నామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును సెక్రటేరియట్ కు పెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్ ఒక్కరే అని కొనియాడారు. అంబేద్కర్‌ను అంత గొప్పగా గౌరవించుకున్న ముఖ్యమంత్రి దేశంలో ఇంకెవరూ లేరని అన్నారు. దళిత బంధు పేరుమీద కేసీఆర్ రూ.10 లక్షల మాత్రమే ఇస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు ప్రకటించారని గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వ పనుల్లో 26% శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారని.. దళిత, గిరిజనులు ఇండ్లు నిర్మించుకుంటే ఆరు లక్షలు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆరు పైసలు కూడా ఇవ్వని సిగ్గులేని ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు.

## గురుకులంలో ఎలుకల కలకలం

- ఆరుగురు విద్యార్థులకు గాయాలు
- కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో ఘటన



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉదయం ఎలుకల కలకలం రేపింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి బోర్నపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల(సైదాపుర్)లో బుధవారం రాత్రి ఆరుగురు విద్యార్థులను ఎలుకలు కరిచాయి. 8వతరగతి విద్యార్థులు యశ్వంత్,సాయిచరణ్, కౌశిక్, అక్షిత్, సృజన్, 9వ తరగతికి చెందిన రక్షిత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించి, వ్యాక్సిన్ వేయించారు. విషయం తెలుసుకున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బండ శ్రీనివాస్, పలువురు నాయకులు పాఠశాలకు వెళ్లి పిల్లలను పరామర్శించారు.

ఈ విషయమై ప్రిన్సిపల్ రాణిని వివరణ కోరగా.. విద్యార్థులకు ప్రమాదం ఏమీ లేదని, ఆరుగురిని కరిచినట్టు తెలిసిందని, మరో ముగ్గురిని కరిచినట్టు అనుమానం ఉందని తెలిపారు. అందరికీ వ్యాక్సిన్ వేయించినట్టు తెలిపారు. సామాన్యంగా సైదాపూర్ మండల పరిధిలో ఉండాల్సిన ఈ గురుకులం అక్కడ భవన సదుపాయం లేకపోవడంతో గత కొంతకాలంగా హుజురాబాద్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.




## రాజ్యసభ సభ్యుడిగా కమల్ హాసన్ ప్రమాణస్వీకారం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నటుడు కమల్ హాసన్ సహా తమిళనాడు నుంచి కొత్తగా ఎన్నికైన నలుగురు రాజ్యసభ సభ్యులు శుక్రవారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన ఇతర ముగ్గురు ఎంపీలు రాజాతి, ఎస్ఆర్. శివలింగం, పి.విల్సన్. కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీకి చెందినవారు కాగా, మిగిలిన ముగ్గురు డిఎంకెకి చెందినవారు. నలుగురు సభ్యులు తమిళంలో ప్రమాణస్వీకారం చేశారు. తమిళనాడుకు చెందిన ఆరుగురు సభ్యులు గురువారం తమ పదవీకాలం పూర్తయిన తర్వాత పదవీ విరమణ చేశారు.

## ఫీజులపై కమిటీ ఏర్పాటు

- చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీలలో ట్యూషన్ ఫీజుల ఖరారు కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నూతన విధివిధానాల రూపకల్పన కోసం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ. బాలకిష్టారెడ్డి చైర్మన్‌గా 10 మందితో ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా అమలులో ఉన్న విధానాలపై అధ్యయనం చేసి, రాష్ట్రానికి అనువైన మార్గదర్శకాలను సిఫార్సు చేయనుంది. ఈ కమిటీలో ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా జారీ చేసిన జీవో 29 ప్రకారం, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రావు, ఎస్సీ సంక్షేమశాఖ డైరెక్టర్ ఎన్. క్షితిజ్, స్టేట్ ఆడిట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, టీడీసీపీ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఓయూ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ కృష్ణయ్య, ఇంకా ఇద్దరు సబ్జెక్ట్ నిపుణులు సభ్యులుగా ఉన్నారు.

ప్రస్తుతం టీఏఎఫ్ఆర్సీ ఆడిటర్ల ఆమోదించిన ఆర్థిక నివేదికల ఆధారంగా మూడేళ్లకోసారి ఫీజులను సవరిస్తోంది. అయితే ఈ విధానానికి ప్రత్యామ్నాయం అందించేందుకే ఈ కమిటీ ఏర్పాటైంది. కమిటీ రూపొందించనున్న విధివిధానాల ఆధారంగా 2025–28 బ్లాక్ పీరియడ్‌కి సంబంధించి ఫీజుల ఖరారును ప్రభుత్వం చేపట్టనుంది.

కమిటీ చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ప్రొఫెషనల్ కాలేజీలను ఏం, ఏ, బీ, సీ, డీ అనే ఐదు గ్రేడ్లుగా విభజించనున్నారు. ఇందుకోసం NAAC, NBA, NIRF గుర్తింపులు, విద్యాసంస్థల వసతులు, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. గ్రేడ్ ఆధారంగానే ట్యూషన్ ఫీజు మరియు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తారని సమాచారం.

2025–28 కాలానికి సంబంధించి ఫీజులపై తుది నిర్ణయం తీసుకోవాలంటూ హైకోర్టు ఇప్పటికే ఆరు వారాల గడువు ఇచ్చింది. అందులో రెండు వారాలు గడిచిపోయాయి. మిగిలిన నాలుగు వారాల్లో ఫీజులపై స్పష్టత ఇవ్వడం అత్యవసరం. కమిటీ సమావేశాన్ని త్వరలో నిర్వహించనున్నట్లు బాలకిష్టారెడ్డి తెలిపారు.

## ఐఏఎస్ శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్ కొట్టివేత..

**బలగం టీవి, హైదరాబాద్**



ఓబులాపురం మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి కి ఊహించని షాక్ తగిలింది. కేసు నుంచి తనకు విముక్తి కల్పించాలని ఇటీవలే ఆమె సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ చేపట్టిన కోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో ఆమె సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు రెండో సారి ఆమె పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం శ్రీలక్ష్మి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు కొట్టివేస్తూ తుది తీర్పును వెలువరించింది. కాగా, సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు. ఓంఎసీకి అక్రమంగా మైనింగ్ లీజు అప్పగించారని కోర్టుకు తెలిపారు. ఓఎంసీకి లీజు కేటాయించేలా శ్రీలక్ష్మి చొరవతీసుకున్నారని ఆరోపించారు. పలు దరఖాస్తులు వచ్చినా ఓఎంసీకి మాత్రమే లీజు మంజూరయ్యేలా చూశారని ధర్మాసనానికి తెలిపారు. ఆమె అక్రమాలకు పాల్పడ్డారని అనడానికి పక్కా ఆధారాలు ఉన్నాయని, సాక్ష్యాధారాలు పరిశీలించాకే ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ కోర్టు తీర్పును వెలువరించిందని కోర్టు దృష్టి తీసుకొచ్చారు. కేసులో సబితా ఇంద్రారెడ్డి , కృపానందంకు ఊరట కల్పించారని.. తనకు కూడా కేసు నుంచి విముక్తి కల్పించాలనుకోవడం సరికాదని, శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేయాలని సీబీఐ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. ఈ మేరుకు ఇరు పక్షా వాదనలు విన్న ధర్మాసనం శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లుగా తీర్పును వెలువరించింది.

## హీరోయిన్ల ఫోన్‌లు హ్యాక్ చేస్తున్నారు.

- **ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన దౌర్జన్యంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలతో పాటు కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి బీఆర్ఎస్ కీలక నేతల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని స్పష్టమైన సమాచారం ఉంది. ప్రైవేట్ హ్యాకర్లను ఉపయోగించి సినీ హీరోయిన్‌ల ఫోన్లను కూడా హ్యాక్ చేయిస్తున్నారు. సీఎం తన మంత్రులకు కూడా 'ఫోన్లు ట్యాప్ చేస్తున్నాం' అని చెప్పినట్టు తెలుస్తోంది" అని వ్యాఖ్యానించారు. "మైహెూంభుజాలో ఏ హీరోయిన్ దగ్గరకు వెళ్లారో తెలుసు. తిరిగిన 16 మందిపై సమాచారం ఉంది" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ విచారించాల్సిన అవసరం ఉందన్నారు. కేబినెట్ సమావేశం రద్దైన దానికి కారణం కూడా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమేనని కౌశిక్ రెడ్డి తెలిపారు. మంత్రులంతా తమ ఫోన్లు ట్యాప్ అవుతున్నాయంటూ పై స్థాయి నేతల దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీకి వెళ్లారని చెప్పారు. దీంతో కేబినెట్ సమావేశాన్ని రద్దు చేశారని, ఢిల్లీలో ఇదే విషయంపై పెద్ద పంచాయితీ జరుగుతోందని వివరించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధినేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు కూడా ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. తన స్వంత ఫోన్‌తో పాటు భార్య ఫోన్‌ను కూడా హ్యాక్ చేసిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటిదాకా ఎలాంటి కేసు నమోదు చేయలేదని కౌశిక్ రెడ్డి వాపోయారు.

## కౌశిక్ రెడ్డి మతిస్థిమితం కోల్పోయినట్టున్నాడు

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

**బలగం టీవి, హైదరాబాద్**



బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉంటుందని సూచించారు. కౌశిక్ రెడ్డి వ్యవహారం చూస్తుంటే మతిస్థిమితం కోల్పోయినట్టుందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హుజురాబాద్ ప్రజలు కూడా అసహ్యించుకునే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. "కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని మీరు స్వయంగా చెబుతుండగా.. ఇప్పుడు ఇతరులపై ఆరోపణలు చేయడం దారుణం" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నుంచి ఈటల రాజేందర్ వర్గంలో చేరిపోతారన్న భయంతో కేసీఆర్ కుటుంబం దృష్టిలో పేరుకుపొందేందుకు ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాల చెక్కులు కూడా ఎక్స్పైరీ డేట్‌కి చేరేలా చేసి పట్టించుకోకుండా ఉండిపోతున్నారని బల్మూరి వెంకట్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తే బీఆర్ఎస్ లో స్థానముంటుందని కౌశిక్ రెడ్డి భావిస్తున్నారని.. కానీ ఇలాగే ప్రవర్తిస్తే "బతుకు కుక్కలు చింపిన ఇస్తరి"లా అవుతుందని హెచ్చరించారు. "ముఖ్యమంత్రి మీద బాధ్యతలేని ఆరోపణలు చేస్తే.. గుడ్డలు ఊడదీసే పరిస్థితులు వస్తాయ్" అంటూ బల్మూరి వెంకట్ గట్టిగా హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు చేయడం తప్పు కాదని.. కానీ వాటికి హద్దులుండాలని సూచించారు.

## ఎయిరిండియాలో సాంకేతిక లోపం

**బలగం టీవి, హైదరాబాద్**

జైపూర్ నుండి ముంబైకి బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. విమానం టేకాఫ్ అయిన 18 నిమిషాలకే పైలట్లు సాంకేతిక సమస్యను గుర్తించారు. వెంటనే అప్రమత్తమై విమానాన్ని వెనక్కి మళ్లించారు. దీంతో విమానం సురక్షితంగా టేకాఫ్ అయిన ప్రదేశంలోనే ల్యాండ్ అయింది. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియా తరుచూ వార్తల్లో నిలుస్తోంది. ఈ వరుస ఘటనలు ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎస్తోనియా సహకారం తీసుకునేందుకు సిద్ధం

- **మంత్రి శ్రీధర్‌బాబు**

**బలగం టీవి, హైదరాబాద్**



ఈ-గవర్నెన్స్, ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రగతిని సాధించిన ఎస్తోనియా దేశంతో సహకారం తీసుకునేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ నేతృత్వంలోని వాణిజ్య ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ఇ-గవర్నెన్స్, హెల్త్ డేటా డిజిటలైజేషన్ రంగాల్లో ఎస్తోనియా అద్భుత ప్రగతిని సాధించింది. వందశాతం హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ చేసిన ఆ దేశం నుంచి సాంకేతిక సహకారం కోరుతున్నాం" అని తెలిపారు. తెలంగాణలో హెల్త్ డేటా డిజిటలైజేషన్ ఇప్పుడే ప్రాథమిక దశలో ఉన్నదని, ఎస్తోనియా అనుభవాలను అధ్యయనం చేసి మోడల్‌గా అమలు చేయాలన్నారు.

ఇ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకిచ్చే సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా రూపొందించేందుకు సహకారం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాల్లో కూడా పరస్పర సహకారం అవసరమన్నారు. "తెలంగాణలో తయారైన డ్రోన్లు ఇటీవల పాకిస్తాన్?? యుద్ధంలో కీలకపాత్ర వహించాయి. భవిష్యత్తు యుద్ధాలు డ్రోన్లు, సైబర్ దాడుల పైనే ఆధారపడి ఉంటాయి" అని చెప్పారు.

**సెప్టెంబరులో ఎస్తోనియా సందర్శించనున్న అధికార బృందం**

ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం తయారీలో తెలంగాణ ముందుందని, ఆ రంగాల్లో కూడా ఉమ్మడి విధానాలు అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలన్న ఎస్తోనియా రాయబారి అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన శ్రీధర్‌బాబు.. విద్య, ఇ-గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించేందుకు ప్రభుత్వ అధికారుల బృందం ఎస్తోనియా వెళ్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, మీసేవా కార్పొరేషన్ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ సంచాలకులు ఆకస్మిక తనిఖీలు

**పలు మార్గదర్శకాలు జారీ..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ బి. రవీంద్ర నాయక్ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆసుపత్రిలో ఉన్న పాముకాటుకు అవసరమైన మందులు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత కి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని (జనరల్ హాస్పిటల్) పరిశీలించిన డైరెక్టర్ రవీంద్ర నాయక్ అక్కడి మందుల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రి సూపరిండెంట్, ఆర్ఎంవోతో కలిసి సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలులో భాగంగా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులపై తనిఖీలు జరిపిన డైరెక్టర్, ఫైర్ సేఫ్టీ, వ్యర్థాల నిర్వహణ, రిజిస్ట్రేషన్లు మరియు రెన్యువల్స్ వంటి అంశాలపై దృష్టి సారించాలంటూ సూచించారు. అన్ని అనుమతులు, నమోదు వివరాలు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సమయానుకూలంగా అప్‌డేట్ చేయాలన్నారు. అంతేకాక, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ఓతో పాటు ప్రోగ్రాం ఆఫీసర్లతో చర్చించి, సీజనల్ వ్యాధుల నియంత్రణతో పాటు ఇతర ఆరోగ్య పథకాలపై లక్ష్యాల సాధనకు కార్యాచరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రజిత, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ అంజలి, డాక్టర్ అనిత, డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ డెమ్ఓ రాజకుమార్, డిపిఎంఓలు సిహెచ్. శ్రీనివాస్, సురేష్, ఈ. దేవి సింగ్, హెచ్ఈఓలు లింగం బాలయ్య, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులను అడ్వాన్స్ బుక్ చేసుకుంటే భారీ తగ్గింపు ధరలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు ఆర్టీసీ ఒక ఆఫర్‌ను అందిస్తోంది. ఇంట్లో జరిగే ఏదైనా శుభకార్యానికి పెళ్ళిళ్ళకు, దైవ దర్శనానికి, తీర్థయాత్రలకు, విహారయాత్రలకు వెళ్ళడానికి ఆర్టీసీ బస్సును బుక్ చేసుకున్న వాటిపై కనివినీ ఎరుగని రీతిలో సుమారుగా 20% ధరలు తగ్గించినారు.

## రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులుగా దుమాల శ్రీకాంత్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులుగా దుమాల శ్రీకాంత్ నియమితులయ్యారు. రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. దుమాల శ్రీకాంత్ గతంలో మున్నూరు కాపు సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర సభ్యునిగా వివిధ హెూదాల్లో సంఘం అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తంకు, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిశంకర్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు



## గోడపైకి ఎక్కిన కారు

**బలగం టీవీ, దుండిగల్**

మేడ్చల్ జిల్లా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శంభీపూర్ ప్రాంతంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. గురువారం అర్ధరాత్రి వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి రోడ్డులోని డివైడర్‌ను ఢీకొట్టి, పక్కనే ఉన్న ఇంటి గోడపైకి ఎగిరిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. శుక్రవారం ఉదయం గోడపై కారు కనిపించడంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కారును కిందికి దించారు. ప్రాథమిక దర్యాప్తులో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. గాయపడిన ఇద్దరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆర్థిక వృద్ధి సాధించాలి... ఆదర్శంగా నిలవాలి..

**-రైతులు మహిళా సంఘాల సభ్యులకు మద్దతుగా ఉండాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**



ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థిక వృద్ధి సాధించి, మిగతా వారికి ఆదర్శంగా నిలువాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం ఇందిరా మహిళా శక్తి కింద వీర్నపల్లి మండలం వన్ పల్లి గ్రామంలోని శ్రీ వర్షిని గ్రామైక్య మహిళా సమాఖ్య ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయ దుకాణాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని అన్నారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని అన్నారు.

రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మద్దతు పలకాలని అన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**అభ్యసన సామర్థ్యాల ఆధారంగా బోధించాలి**

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా పాఠ్యాంశాలు బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వీర్నపల్లి మండలం వన్ పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ సెంటర్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్లోని తరగతి గదిలో విద్యార్థులకు వెలుతురు సక్రమంగా లేకపోవడం గమనించి, వెంటనే ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అంగన్వాడి సెంటర్ వంటగది వర్షానికి నీరు కురుస్తున్నందున పాఠశాలలో అదనంగా ఖాళీగా ఉన్న గదిలోకి మార్చాలని ఆదేశించారు.

**ప్రవేశాలు ఎందుకు తక్కువ ఉన్నాయి..**

ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 30 మంది విద్యార్థులు మాత్రమే ఉండడం గమనించి అడ్మిషన్లు తక్కువగా ఉండడానికి గల కారణాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్ లో గ్యాస్ కనెక్షన్ రాకపోవడం గమనించి వెంటనే గ్యాస్ కనెక్షన్ అందజేయాల్సిందిగా విద్యాధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి, గడ్డి మొక్కలు పెరగడం గమనించిన కలెక్టర్ వాటిని వెంటనే శుభ్రం చేయాలని పంచాయతీ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశారు.

**దివ్యాంగురాలి సమస్యల పై తక్షణం స్పందించి**

వీర్నపల్లి మండలం వన్ పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా ఉన్న దివ్యాంగురాలైన మహిళ తన ఇంటికి వెళ్ళేందుకు నాలా అడ్డుగా ఉందని, తనకు మంచినీటి కనెక్షన్ ఇవ్వలేదని, తన పురాతన పెంకుటిల్లు ఉన్నదని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు విన్నవించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.. నాలాపై సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేయాలని, దివ్యాంగురాలుకు నల్లా కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. వన్ పల్లి ఇందిరమ్మ ఇండ్ల గ్రామ కమిటీ సభ్యులకు ఇలాంటి సమస్యలు ఉన్న పేదవారిని మరోసారి పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

**వైద్య సేవలు ఎలా అందుతున్నాయి..**

వీర్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్, సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అడిగి తెలుసుకున్నారు. వీర్లపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, ఓపీ రిజిస్టర్, మందులు, వైద్యం అందించే గదులను పరిశీలించారు. పీ హెచ్ సీ ద్వారా నిత్యం ఎందరికి వైద్యం అందిస్తున్నారో డాక్టర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు.

దవాఖాన కు వైద్య చికిత్స కోసం వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యల పై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి గత నవంబర్ నెలలో శంకుస్థాపన చేసిన పనులు ఇంకా మొదలు పెట్టకపోవడం పై ఆర్ అండ్ బీ డీఈ కి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

## రైతులకు ముఖ్యమైన విన్నపం

**జిల్లా వ్యవసాయ శాఖ..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, జిల్లా వ్యవసాయ శాఖ రైతాంగానికి అత్యంత ముఖ్యమైన విజ్ఞప్తి చేసింది. జిల్లాలోని అన్ని మండలాల రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యూరియా లేదా ఇతర రసాయన ఎరువులను పంటలకు వేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.

అధిక వర్షపాతం కారణంగా ఎరువులు నీటిలో కొట్టుకుపోయి, వాటి ప్రభావం పూర్తిగా నష్టపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. దీనివల్ల రైతులకు ఆర్థిక నష్టంతో పాటు, పంటలకు ఎరువుల ప్రయోజనం చేకూరదని వివరించారు. కాబట్టి, రైతులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతానికి ఎరువుల వాడకాన్ని నిలిపివేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత, వాతావరణ పరిస్థితులను బట్టి ఎరువుల వాడకంపై తదుపరి సూచనలు జారీ చేయబడతాయి. రైతులు ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్యాస్ కనెక్షన్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి వచ్చింది. మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఇబ్బందులు దూరం చేసింది.

కలెక్టర్ బుధవారం వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కట్టెల పొయ్యి పై వంటలు సిద్ధం చేస్తూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించారు. వెంటనే ఆ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందజేశారు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆహార పదార్థాలను గ్యాస్ స్టవ్ పైనే సిద్ధం చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ తో తమ పాఠశాలలోని కట్టెల పొయ్యి దూరమై గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి రావడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంప్లెక్స్ మీటింగ్ విజయవంతం..

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ మీటింగ్ (ప్రై.లెవెల్) శుక్రవారం రోజున నిర్వహించారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు తప్పకుండా ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం శుభపరిణామం అని మండల విద్యాధికారి నెల్లుట్ల శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ బోయినిపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భూమయ్య, జడ్.పి.హెచ్.ఎస్ విలాసాగర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోలగం శ్రీనివాస్, ఎం.ఆర్.పిలు బి.జగన్మోహన్, బి.నరేందర్ కే నరేష్, ప్రైమరీ హెడ్మాస్టర్లు (ఎల్.ఎఫ్.ఎల్, హెచ్.ఎం.ఎస్), మండల టీచర్లు(50%) హాజరైనారు.



## పోలీస్ జాగిలాల గదులను ప్రారంభించిన ఎస్పీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ జగిలాలు నేర పరిశోధన,భద్రతా చర్యలు, మాదకద్రవ్యాల నియంత్రణ, విపత్తు పరిస్థితుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయిని, శిక్షణా సామర్థ్యం వల్ల విభిన్న ఆపరేషన్లలో వీటిని వినియోగిస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోలీస్ జగిలాల సంరక్షణలో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాటి కోసం నూతనంగా నిర్మించిన గదులను ప్రారంభించారు.

ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ.. విశ్వాసానికి మారు పేరుగా నిలిచే జాగిలాలు పోలీస్ శాఖకు నేర పరిశోధనలో కీలకంగా మారుతున్నాయిని హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జగిన సమయంలో నిందితులను పట్టించడం, సంఘవిద్రోహులు అమర్చే పేలుడు పదార్థాలను గుర్తించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో పోలీసు జాగిలాలు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయిని అన్నారు. మాదకద్రవ్యాలు , బాంబులు , మరియు ఇతర అనుమానాస్పద వస్తువులను గుర్తించడంలో ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయిని జిల్లాలో అనేక కేసులను ఛేదించడంలో మరియు ఆధారాల సేకరణలో వీటి పనితీరు ప్రశంసనీయమైనది అని అన్నారు. పోలీస్ జగిలాలకు అధునాతన శిక్షణ, వైద్య సంరక్షణ, మరియు తగిన సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు జగిలాలు ఉన్నాయని, వీటి నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన హ్యాండ్లర్స్ ఉన్నారని వెల్లడించారు. ఎస్పీ వెంట వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సి.ఐ లు కృష్ణ, మొగిలి, నటేష్,ఆర్.ఐ లు రమేష్,యాదగిరి,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు, డాగ్స్ హ్యాండ్లర్స్ కార్తీక్, సురేష్, శ్రీనివాస్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఎరువుల నిల్వలపై ఆకస్మిక తనిఖీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్, కార్యదర్శి ఆదేశాల మేరకు ఎరువుల నిల్వలు, అమ్మకాలపై నియమితులైన ఆకస్మిక తనిఖీ అధికారి ఎస్.వి. ప్రసాద్ (జాయింట్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ / జీఎం హకా హైదరాబాద్), జిల్లా సహకార అధికారి రాజన్న సిరిసిల్ల టి. రామకృష్ణ ఈరోజు నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎరువులకు సంబంధించిన రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు అన్ని వేళలా ఎరువులు అందుబాటులో ఉంచాలని, సంఘాల ద్వారా రైతులకు నిరంతరం సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. రమాదేవి, సంఘ కార్యదర్శి అజయ్, సిబ్బంది అంజయ్య, రాజయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ముస్తాబాద్ మండలం, గూడెం గ్రామానికి చెందిన సూర అజయ్, సూర ప్రదీప్ అనే ఇద్దరు యువకులను నిషేధిత గంజాయి విక్రయిస్తున్నారనే ఆరోపణలతో పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని ఈ రోజు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గూడెం గ్రామంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారనే పక్కా సమాచారం మేరకు ముస్తాబాద్ ఎస్.ఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి వెళ్లారు. అనుమానాస్పదంగా కనిపించిన అజయ్, ప్రదీప్‌లను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, వారి వద్ద 109 గ్రాముల గంజాయి లభ్యమైంది. పోలీసులు వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ, అక్రమంగా గంజాయి సేవించినా, క్రయవిక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రత్యేక డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేసి, గంజాయి రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రజలను కోరారు.

# భారీ ఆధిక్యం దిశగా ఇంగ్లండ్

- ఇంగ్లండ్ 544/7
- భారత్‌పై 186 పరుగుల ఆధిక్యం
- రోజంతా భారత్ తీసింది 5 వికెట్లే





బలగం టీవీ, హైదరాబాద్

భారత్‌తో నాలుగో టెస్ట్‌లో ఇంగ్లండ్ పట్టు బిగించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 135 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 544 పరుగులు చేసింది. జో రూట్ (150), బెన్ స్టోక్స్ (77 బ్యాటింగ్), ఓలీ పోప్ (71) అద్భుత ప్రదర్శనతో రాణించడంతో భారీ స్కోరును నమోదుచేసింది. దీంతో ఇంగ్లండ్ ఇప్పటికే 186 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

**రూట్ సెంచరీ, స్టోక్స్ అర్ధశతకం**

225/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆరంభించిన ఇంగ్లండ్‌కు జో రూట్, ఓలీ పోప్ శుభారంభం అందించారు. ఓలీ పోప్ 93 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, రూట్ 99 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. వీరిద్దరూ కలిసి 144 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఓలీ పోప్‌ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా, హ్యారీ బ్రూక్ (3) త్వరగానే పెవిలియన్ చేరాడు. జో రూట్ అనంతరం సెంచరీని పూర్తి చేసి, 248 బంతుల్లో 14 ఫోర్లతో 150 పరుగులు చేశాడు. స్టోక్స్ 97 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. క్రాంప్స్ కారణంగా రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. తర్వాత మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చి డాసన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిలబెట్టాడు.

మూడో సెషన్ డ్రింక్స్ విరామం తర్వాత టీమ్‌ఇండియాకు కలిసొచ్చింది. జడ్డూ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయిన రూట్.. స్టంపౌట్ అయ్యాడు. స్టోక్స్ స్థానంలో వచ్చిన స్మిత్ (9)ను బుమ్రా పెవిలియన్‌కు పంపాడు. సిరాజ్ బౌలింగ్‌లో వోక్స్ (4) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. స్టోక్స్ మళ్లీ వచ్చి డాసన్ (21*)తో కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో రెండు వికెట్లు తీశారు. బుమ్రా, సిరాజ్, అన్షుల్ కంబోజ్ తలో వికెట్ తీసుకున్నారు.

నాలుగో టెస్ట్‌లో టీమిండియా బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. మూడో రోజు ఆట తొలి సెషన్ మొత్తంలోనూ ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడంతో, గత దశాబ్దంలో అత్యంత దారుణమైన బౌలింగ్ ప్రదర్శన చేసింది. భారత పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, అరంగేట్ర పేసర్ అన్షుల్ కంబోజ్, అలాగే పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ఎలాంటి ప్రభావాన్ని చూపలేక పోయారు. ఇంగ్లండ్ బ్యాటర్ల బాజ్‌బాల్ స్టైల్‌కు దిక్కుతోచని విధంగా ధారాళంగా పరుగులు ఇవ్వడమే కాకుండా.. వికెట్ల కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈ క్రమంలో టీమిండియా ఓవర్‌సీస్ టెస్టుల్లో చెత్త రికార్డు నమోదు చేసింది. గత 10 ఏళ్లలో తొలిసారి 500కిపైగా పరుగులు ఇచ్చిన మ్యాచ్‌గా ఇది నిలిచింది.

**చరిత్ర సృష్టించిన రూట్**

ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్‌లో అరుదైన మైలురాయిని అధిగమించాడు. భారత్‌తో జరుగుతున్న నాల్గో టెస్ట్‌లో సెంచరీ నమోదు చేసి టెస్ట్ క్రికెట్ చరిత్రలో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ (13,378 పరుగులు)ను అధిగమించిన జో రూట్, 13,379 పరుగులతో సచిన్ టెండూల్కర్ (15,921) తర్వాతి స్థానాన్ని సంపాదించాడు. జో రూట్ ఈ ఘనతను అన్షుల్ కంబోజ్ వేసిన 101వ ఓవర్ మూడో బంతికి సింగిల్ తీసి సాధించాడు. ఇక ఇది అతడి 38వ టెస్ట్ సెంచరీ కావడం విశేషం. ఈ క్రమంలో శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర (38 శతకాలు)తో సమానమయ్యాడు.



# రిటైర్మెంట్ ప్రకటించిన వేద కృష్ణమూర్తి

బలగం టీవీ, హైదరాబాద్

భారత మహిళా క్రికెట్ జట్టుకు సుదీర్ఘకాలంగా సేవలందించిన మిడిలార్డర్ బ్యాటర్ వేద కృష్ణమూర్తి అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పింది. సోషల్ మీడియా వేదికగా తన రిటైర్మెంట్‌ను ప్రకటించిన వేద.. "హృదయపూర్వకంగా ఆటకు వీడ్కోలు చెబుతున్నాను" అంటూ భావోద్వేగ పోస్ట్ చేసింది.

కర్నాటకలోని కడూర్ అనే చిన్న పట్టణం నుంచి వచ్చిన వేద.. తాను బ్యాట్ పట్టినప్పటి నుంచే క్రికెట్ తన జీవితాన్ని మార్చేసిందని, తన కలలను సాకారం చేసిందని పేర్కొంది. "చిన్నప్పటికి క్రికెట్ అంటే తెలియకుండానే ఆట మొదలుపెట్టాను. అమ్మ వత్తల ప్రోత్సాహంతో అబ్బాయిల ఆట అయినా క్రికెట్‌నే ఎంచుకున్నాను. ఈ ఆటే నన్ను గొప్ప స్టేడియాలకి, ఇండియా జెర్సీ వరకు తీసుకొచ్చింది" అంటూ భావోద్వేగంగా వెల్లడించింది. "కష్టకాలాల్లో ఎలా పోరాడాలో క్రికెట్ నేర్పింది. నేను ఎవర్ని.. నా సత్తా ఏంటో ఈ ఆటే తెలిసేలా చేసింది. క్రికెట్ నాకు కెరీర్ మాత్రమే కాదు.. జీవిత పాఠాలు కూడా నేర్పింది" అంటూ తెలిపింది. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యులు, బీసీసీఐ, సహచరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

వేద 2011లో భారత జట్టులోకి వచ్చింది. దాదాపు తొమ్మిదేళ్ల పాటు దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె 48 వన్డేలు, 76 టీ20లు ఆడింది. వన్డేల్లో 829 పరుగులు, టీ20ల్లో 875 పరుగులు చేసిన వేద.. 2017 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌లో పాల్గొన్న జట్టులో సభ్యురాలు. చివరిసారిగా ఆమె 2020లో ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కర్నాటక, రైల్వే జట్లకు కెప్టెన్‌గానూ సేవలందించింది.

# యశ్ దయాల్‌పై పోక్సో కేసు

బలగం టీవీ, హైదరాబాద్



ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2025 టోర్నమెంట్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) విజయానికి కీలకంగా నిలిచిన యువ ఫాస్ట్ బౌలర్ యశ్ దయాల్ ప్రస్తుతం వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నాడు. అతనిపై వరుస లైంగిక ఆరోపణలు వెల్లువెత్తడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.


ఇప్పటికే ఇటీవల ఘజియాబాద్‌కు చెందిన ఓ యువతి యశ్ దయాల్‌పై మోసం చేశాడని, పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా, మానసికంగా వేధించాడంటూ ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, అలహాబాద్ హైకోర్టు నుంచి యశ్ తాత్కాలిక స్టే తెచ్చుకున్నాడు. అయితే, ఈ వివాదం ఇంకా సద్దుమణగకముందే.. తాజాగా జైపూర్‌కు చెందిన 17 ఏళ్ల క్రీడాకారిణి.. యశ్ దయాల్‌పై మరో ఆరోపణ చేసింది. తనను క్రికెట్ స్టార్ చేస్తానని నమ్మబలికి.. గత రెండు సంవత్సరాలుగా లైంగికంగా వేధించాడని ఆరోపించింది. బాధితురాలికి అప్పట్లో వయస్సు 18 లోపే ఉండటంతో.. ఈ కేసు పిలవబడే పోక్సో చట్టం కింద నమోదు అయింది. తాజా పోక్సో కేసు అతని అరెస్ట్‌కు దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'వార్ 2' ట్రైలర్ వచ్చేసింది

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2' ట్రైలర్ గురువారం విడుదలైంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ద్వారా ఎన్టీఆర్ బాలీవుడ్‌కి గ్రాండ్ ఎంట్రీ ఇస్తుండగా, యశ్‌రాజ్ ఫిలింస్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. ఈ చిత్రాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. యశ్‌రాజ్ స్పై యూనివర్స్‌లో భాగంగా 'వార్', 'పఠాన్', 'టైగర్ 3' వంటి సూపర్ హిట్ల తర్వాత వస్తోన్న 'వార్ 2'పై భారీ అంచనాలున్నాయి.

ట్రైలర్‌లో హృతిక్, ఎన్టీఆర్ మధ్య ఉన్న శక్తివంతమైన యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులలో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఎర్ర బారెడారి, బుల్లెట్‌ల వర్షం, వేగవంతమైన ఛేజింగ్ సీన్స్.. అన్నీ ఈ సినిమాను విజువల్ ట్రీట్‌గా మలుస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమాలో కియారా అద్వానీ గ్లామర్‌తో పాటు యాక్షన్ లుక్‌తో ఆకట్టుకోనుంది. తెలుగు వెర్షన్ హక్కులను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఐమాక్స్ ఫార్మాట్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ బాలీవుడ్ అరంగేట్ర చిత్రం కావడంతో.. 'వార్ 2'పై అంచనాలు భారీగానే ఉన్నాయి.




# విశ్వంభర' షూటింగ్ పూర్తి



బలగం టీవీ, హైదరాబాద్

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో రూపొందుతోన్న సోషియో ఫాంటసీ విజువల్ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర' చిత్ర షూటింగ్ పూర్తి అయింది. ప్రముఖ దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ మెగాస్టార్, మౌని రాయ్‌లపై తెరకెక్కించిన భారీ డ్యాన్స్ నంబర్‌తో ముగిసినట్లు చిత్రబృందం ప్రకటించింది. యువి క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. అద్భుతమైన టీజర్, చార్ట్‌బస్టర్ సింగిల్స్‌తో ఇప్పటికే ఈ సినిమా పట్ల భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతర్జాతీయంగా ప్రాముఖ్యత కలిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విశ్వంభర ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేయడం విశేషం. ఈ సినిమాలో మ్యూజిక్ రంగం రెండు మేటి సంగీత దర్శకులకు అప్పగించారు. ఆస్కార్ అవార్డు విజేత ఎంఎం కీరవాణి సినిమా మొత్తం స్కోర్ అందిస్తుండగా, మాస్ అండ్ హై ఎనర్జీ పాటలను భీమ్స్ సిసిరోలియో స్వరపరుస్తున్నారు. ఇటీవల షూట్ చేసిన స్పెషల్ సాంగ్‌కు శ్యామ్ కాసర్ల సాహిత్యం అందించగా, గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ అందించారు. ఈ పాటను 100 మంది డ్యాన్సర్స్‌తో గ్రాండ్‌గా తెరకెక్కించారు. చిరంజీవి తనదైన డ్యాన్స్ స్టైల్‌తో అదరగొట్టగా, మౌని రాయ్ తన ఎనర్జీతో మెప్పించారు. త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఛోటా కె నాయుడు సినిమాటోగ్రఫీ అందించగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ నిర్వహిస్తున్నారు. త్వరలో విడుదల తేదీతో కూడిన అధికారిక ప్రకటన చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.




# 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

'మత్తు వదలరా' ఫేమ్ నరేష్ అగస్త్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' ట్రైలర్ గురువారం విడుదలైంది. విపిన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. లవ్ అండ్ మ్యూజికల్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే ఈ కథలో భావోద్వేగాలు, కుటుంబ బంధాలు ప్రధానంగా నిలవనున్నాయి. ట్రైలర్ చూస్తుంటే.. తన అమ్మమ్మ కలలు నెరవేర్చేందుకు ఓ మనవడు చేసిన ప్రయత్నాలే ఈ చిత్రానికి ప్రాణంగా నిలవనున్నట్లు తెలుస్తోంది. ట్రైలర్‌లో మ్యూజిక్, ఎమోషనల్ మూడ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రాన్ని ఉమా దేవి కోట నిర్మించారు. మోహనకృష్ణ సినిమాటోగ్రఫీ అందించగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చారు. హీరోయిన్‌గా రబియా ఖాతూన్ నటించగా, రాధికా శరత్‌కుమార్, విరాజిత్, తులసి, సుమన్, తనికెళ్ల భరణి, ఆమని వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా యువతను కట్టిపడేస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది.